క్లుప్తంగా

బెల్టు షాపులు నిర్వహిస్తే రూ.50 వేల జరిమానా

లింగంపేట(ఎల్లారెడ్డి): కోమట్‌పల్లి, కేశాయిపేట, అన్నారెడ్డిపల్లి గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే రూ.50వేలు జరిమానా విధిస్తామని గ్రామస్తులు తీర్మాణించుకున్నారు. ఈ సందర్భంగా మూడు గ్రామాలకు చెందిన పెద్దలు, గ్రామస్తులు మంగళవారం సమావేశం నిర్వహించి గ్రామ సమస్యలు చర్చించుకున్నారు. బెల్టు షాపులు నిర్వహించకూడదని మూడు గ్రామాల ప్రజలు కలిసి తీర్మాణించుకున్నట్లు తెలిపారు. అలాగే మూడు గ్రామాల పరిసరాల్లో కూర్చొని మద్యం సేవిస్తే వారిని పట్టుకొని పోలీసులకు అప్పగిస్తామని హెచ్చరించారు. పెద్దలు బాలయ్య, తిరుపతి, విఠల్, రాజయ్య, అల్లూరి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలి


రుద్రారం నర్సరీలో మొక్కలకు నీరు పడుతున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డిరూరల్: నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. మంగళవారం రుద్రారం నర్సరీని ఆయన పరిశీలించారు. నర్సరీలోని మొక్కలకు నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా మొక్కలు ఎండకుండా చూడాలని, వాటికి నీరు పోయడంతో పాటు గ్రీన్ షేడ్ నెట్లు ఏర్పాటు చేసి అవి చిరగకుండా కాపాడాలని అన్నారు. ఎంపీవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

'ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే వరకు నియామకాలు వద్దు'


నిరసనలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కామారెడ్డి అర్బన్ : ఎస్సీ వర్గీకరణ చట్టం అమల్లోకి వచ్చే వరకు ఎలాంటి నియామకాలు చేపట్టవద్దని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, గ్రూప్–1, 2, 3 ఫలితాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంతి పద్మారావు, ఉపాధ్యక్షుడు ఆర్.బాగయ్య, పద్మశ్రీ, సత్తిగారి లక్ష్మి, తుంట సాయిలు, యాదగిరి, రంగరి సాయిలు, శివరాజ్ శ్రీకాంత్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలి



సదాశివనగర్(ఎల్లా రెడ్డి) : అర్హులైన దళితులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య మంగళవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును కలిసి విన్నవించారు. ప్రతి పల్లె, తండాల్లో రోడ్లు, బోర్లు వేయిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు ఆయన తెలిపారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ


బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పార్శి రాములు కల్యాణ మండపంలో జిల్లాలోని ఎంపిక చేసిన 40 పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయి చరణ్, నందీశ్వర్‌లు నాలుగో స్థానంలో నిలిచి ప్రశంసా పత్రం, మెమెంటోతో పాటు రూ.1500 నగదును బహుమతిగా పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి తెలిపారు. కాగా వీరికి గైడ్ టీచర్‌గా వ్యవహరించిన ప్రవీణ్ కుమార్, ప్రభాకర్, విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. జిల్లా సైన్స్ అధికారి సిద్ధరామిరెడ్డి, ఎఫ్‌పీఎస్‌టీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ బలరాం, నిజామాబాద్, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి బీసీ కాలనీలోని ప్రాథమి క పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ సాయాగౌడ్ తమ ఆ వార్డ్ టీచర్స్ అసోసియేషన్ తరపున ఒకటో తరగతి విద్యార్థులకు 20 కుర్చీలు బహూకరించారు. వీటిని పాఠశాల మాజీ చైర్మన్ పంపరి నర్సింలు చేతుల మీదుగా అందజేశారు.

జోరుగా మొరం దందా

కాసులు కురిపిస్తున్న వ్యాపారం
- అధికారుల మెతకవైఖరితో యథేచ్ఛగా రవాణా
- అనుమతులు లేకున్నా దర్జాగా తరలింపు


సోమేశ్వర్‌గుట్టపై మొరం తవ్వుతున్న పొక్లెయిన్


బోర్లం రోడ్డులోని మైనార్టీ పాఠశాల వెనుక మొరం గుంతలు

బాన్సువాడ రూరల్: దినదినాభివృద్ధి సాధిస్తున్న బాన్సువాడ మున్సిపాలిటీలో స్థిరాస్తి వ్యాపారంతో పాటు భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వెంచర్లలో ప్లాట్లు అమ్ముడుపోవాలన్నా..ఇంటి నిర్మాణ సమయంలో బరంతి పోయాలన్నా మొరం, మట్టి తప్పనిసరి. ఇలా ప్రజల అవసరాన్ని ఆసరాగా తీసుకున్న మొరం వ్యాపారులు శివారు గ్రామాల్లోని గుట్టలను గుల్ల చేస్తున్నారు. ప్రతిరోజు వందలాది వాహనాల్లో నిబంధనలకు విరుద్ధంగా మొరం తరలిస్తుండటంతో రానున్న తరాలు అడవులు, గుట్టలను పుస్తకాల్లోనే చూసుకోవాల్సి వస్తుందనిపిస్తోంది. రెవెన్యూ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మొరం, మట్టి వ్యాపారం చేస్తున్నా అధికారులు ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. ప్రొక్లెయిన్లతో భారీ గుంతలు తీస్తుండటంతో వర్షాకాలంలో వాటిలో నీరు చేరి పశువులు, మనుషులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది.

జాతీయ రహదారి విస్తరణకు..

చెరువులు, కుంటలు, సీలింగ్, అసైన్‌మెంట్, దేవాదాయ భూముల నుంచి మట్టి తరలించడానికి ప్రభుత్వ పరంగా ఆంక్షలున్నాయి. కనీసం పట్టా భూముల నుంచి వాణిజ్య అవసరాల కు మట్టిని తరలించాలన్నా రెవెన్యూ అధికారుల అనుమతులు తప్పనిసరి. కాని జాతీయ రహదారి విస్తరణకు నిత్యం వందలాది టిప్పర్లతో మొరం తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకుంటే ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో ఆదాయం సమకూరుతుంది. కాని మొరం మాఫియా గ్రామాల్లో చోటామోటా నాయకులకు, పలుకుబడి కలిగిన వ్యక్తులకు, క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ముడుపులు అప్పగించి మొరం దందాను మూడు పూవులు, ఆరుకాయలుగా కొనసాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

అనుమతులు ఇవ్వలేదు

సోమేశ్వర్, ఇబ్రహీంపేట్, తాడ్కోల్, బుడిమి, కొత్తాబాది, బోర్లం తదితర గ్రామాల్లో మొరం రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఇటీవల ఇబ్రహీంపేట్‌లో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్న జేసీబీ, ఓ టిప్పర్‌ను అదుపులో తీసుకుని రూ.20 వేలు జరిమానా విధించాం. సోమేశ్వర్ శివారులో మైనింగ్ అధికారులతో టిప్పర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించాం. మండలంలో జాతీయ రహదారి పనులకు కూడా మొరం అనుమతులు లేవు. మొరం తరలింపు గురించి సమాచారం అందిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– వరప్రసాద్, తహసీల్దార్, బాన్సువాడ

దాడుల సమాచారం చేరవేస్తున్న ఇంటి దొంగలు

ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టుకోలేడన్నట్లు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు స్థానిక అధికారులు మొరం అక్రమరవాణాపై దాడులకు ఉపక్రమిస్తున్న సమాచారాన్ని సంబంధిత శాఖలోని కొంత మంది మొరం మాఫియాకు చేరవేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అధికారులు వచ్చే సమయానికి సంబంధిత మొరం వ్యాపారులు ప్రొక్లెయిన్లు, టిప్పర్లను అక్కడి నుంచి తప్పిస్తున్నారు. గ్రామాల్లో వనరులను సంరక్షించే గ్రామ రెవెన్యూ అధికారి పోస్టు రద్దు కావడం, అధికారుల మెతక వైఖరి, రాజకీయ నాయకుల పలుకుబడి, కాంట్రాక్టర్ల ధనదాహం వెరసి గుట్టలు గుల్ల అవుతున్నాయి.

ఆడబిడ్డలకు వరంలా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్


లబ్ధిదారులతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : ఆడబిడ్డలకు వరంలా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశ పెట్టారని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడలోని తన నివాసంలో వర్ని, చందూర్, కోటగిరి మండలాలకు చెందిన 82 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లల పెళ్లిళ్లు చేసే తల్లిదండ్రులకు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. ఆయా మండలాల తహసీల్దార్లు, నాయకులు హన్మంతు, అనిల్ తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


పాల్గొన్న సబ్‌కలెక్టర్, ఇతర మహిళలు

బాన్సువాడ రూరల్: మహిళలు ఆత్మన్యూనతా భావాన్ని వీడి అన్ని రంగాల్లో రాణించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం బాన్సువాడలోని నర్సింగ్ కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళలు విద్యాపరంగానే కాకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. సమాజంలో మహిళలు కుటుంబ బాధ్యతలకే పరిమితం కారాదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 33 శాతం రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజకీయాల్లో మహిళలు రాణించడానికి చక్కటి అవకాశాలు ఉన్నాయని, వాటిని చక్కగా వినియోగించుకోవాలన్నారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా చేయడమే లక్ష్యం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రఘువర్మ

కామారెడ్డి రూరల్: మహిళలను గొప్ప వ్యాపారవేత్తలుగా తయారు చేయడమే ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం ముఖ్య ఉద్దేశమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రఘువర్మ అన్నారు. కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో ఈ పథకం ద్వారా కామారెడ్డి, సదాశివనగర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ పథకం విధివిధానాలను, పథకం పొందేందుకు అర్హతలను లబ్ధిదారులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా డీపీఎం రఘువర్మ మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా వ్యక్తిగత రుణాలతోపాటు గ్రూప్ రుణాలను పొంది ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ సభ్యులతో ఏర్పడిన గ్రూప్‌నకు రూ.10 కోట్ల వరకు రుణాలను పొందవచ్చని తెలిపారు. డీఆర్‌డీఏ ఏపీడీ మురళీ కృష్ణ, ఐకేపీ ఏపీఎం మోయిజ్, పీఎం ఎఫ్‌ఎం శిక్షకులు రఘు, డీఆర్‌పీ రచన, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాత పరీక్ష ద్వారా సీఆర్పీల ఎంపిక


మాట్లాడుతున్న డీపీఎం రమేశ్‌బాబు

లింగంపేట(ఎల్లారెడ్డి) : గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాత పరీక్ష ద్వారా సీఆర్పీలను ఎంపిక చేస్తున్నట్లు ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబు తెలిపారు. మంగళవారం లింగంపేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి, గాంధారి, లింగంపేట మండలాల్లోని మహిళా సంఘాల సభ్యులకు ఎస్వీఈపీ కార్యక్రమం అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు మండలాల్లోని గ్రామీణ ప్రాంత మహిళలకు జీవనోపాధి కల్పించడానికి సీఆర్పీలను(కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్)ను నియమిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సీఆర్పీల ఎంపిక కోసం మంగళవారం పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఎల్లారెడ్డికి 10 మంది, గాంధారి 10 మంది, లింగంపేటకు ఐదుగురిని ఎంపిక చేస్తామన్నారు. వీరు ఆయా మండలాల్లో మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించడానికి కృషి చేస్తారని తెలిపారు. మహిళలు కిరాణ దుకాణాలు, జనరల్ స్టోర్స్, హోటళ్లు, కుల వృత్తులు ఏర్పాటు చేసుకోవడానికి రుణాలు ఇప్పించి ప్రోత్సహిస్తారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఏపీఎం శ్రీనివాస్, రాజేందర్, ప్రసన్నరాణి, గంగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



దోమకొండ: మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అబ్రబోయిన భూలక్ష్మి, కార్యదర్శిగా ముద్దసాని స్వప్న, కోశాధికారిగా శారదలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐకేపీ డీపీఎం సుధాకర్, ఏపీఎం రాజు మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కళాజాత



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ జెడ్పీహెచ్ఎస్‌లో కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం సైబర్ క్రైం గురించి వివరించారు. ప్రతి మహిళ వారి ఫోన్లలో టీ–సేఫ్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, మాదకద్రవ్యాల వినియోగాన్ని అందరూ మానుకోవాలన్నారు. షీటీం నెంబర్ 8712686094, సైబర్ నేరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నెంబర్లు 100, 108, 1930, 181 ల గురించి వివరించారు. పాఠశాల హెడ్మాస్టర్ సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ యూత్ అధ్వర్యంలో సీమంతాలు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : సంగంలో సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు సీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వాణి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం సంతోషించదగ్గ విషయం అన్నారు. అనంతరం ప్రతి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు సునీల్ రాథోడ్, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.


నిజాంసాగర్ కస్తూర్బాలో భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి ప్రమీల

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు వసతి గృహాలను మంగళవారం అధికారులు, స్థానిక కాంగ్రెస్ నేతలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంతో పాటు మెనూ లిస్టు, సరుకులు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. వంటలను ఎప్పటికప్పుడు పరిశీలించిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్


గోపాల్‌పేట్ మోడల్‌స్కూల్‌లో.. కాంగ్రెస్ నేతలు


తాడ్వాయి కస్తూర్బా పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రాజారాం


భిక్కనూరు బీసీ సంక్షేమ వసతి గృహంలో.. ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి


బీబీపేటలోని కేజీబీవీలో..

నిబంధనల ప్రకారం పనులు చేయాలి


ఎల్లారంలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో


భిక్కనూరులో పనులను పరిశీలిస్తున్న ఎంపీవో

లింగంపేట(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పనులు చేయాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. మంగళవారం ఆయన ఎల్లారం గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలకు అవసరమైన వసతులు కల్పించాలని క్షేత్రసహాయకులకు సూచించారు. ఎంత మంది పనుల్లో పాల్గొంటున్నారని.. మస్టర్లను పరిశీలించారు. క్షేత్రసహాయకుడు సాయన్న ఉన్నారు.

భిక్కనూరులో..

ఎల్లారెడ్డి: గ్రామాలలో ఉపాధి హామి కూలీల సంఖ్యను పెంచేలా చూడాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూరులో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. టీఏ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి స్వప్న తదితరులున్నారు.

ప్రతి ఒక్కరికి పని కల్పిస్తాం

బిచ్కుంద(జుక్కల్): ఉపాధి హామీ పని చేస్తామని ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి పని కల్పిస్తామని, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గోపాల్ అన్నారు. మంగళవారం బిచ్కుంద, దేవాడలో ఉపాధి పనులు పరిశీలించి కూలీతో మాట్లాడారు. కొలతల ప్రకారం కూలీ చెల్లిస్తామని, వంద రోజులు పనులు చేసుకోవాలని కోరారు.

సమాచారం..

వైద్య పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ: బాన్సువాడ ప్రాంతీయ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాన్సువాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి తెలిపారు. గైనకాలజిస్టు–02 (ఎంబీబీఎస్–డీసీవో), పిడియాట్రిక్–02 (ఎంబీబీఎస్–డీసీహెచ్), జనరల్ మెడిసిన్–01 (ఎండీ జనరల్ మెడిసిన్), జనరల్ సీడీఎంవో–03 (ఎంబీబీఎస్)ల పోస్టులకు అర్హులైన వైద్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 12 నుంచి 17లోపు సర్టిఫికెట్లను డీసీహెచ్ఎస్ జిల్లా ఆస్పత్రి కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు. 18న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

రేపు ఉపాధి పనులపై ప్రజావేదిక

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిధిలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై ఈ నెల 13న ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తేదీ 01-04-2023 నుంచి 31-03-2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ పూర్తయిందన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

దుమ్మూ ధూళితో ఇబ్బందులు


కొత్తాబాది సమీపంలో రోడ్డుపై లేస్తున్న దుమ్ము

జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండటంతో బాన్సువాడ –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై కంకర పౌడర్ పోశారు. నెలల తరబడి బీటీ వేయకపోవడంతో భారీ వాహనాలు వెళ్తున్నప్పుడు విపరీతంగా వస్తున్న దుమ్మూ ధూళితో వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ప్రధాన రహదారితోపాటు కల్వర్టుల విస్తరణ కోసం తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్లపై వాటర్ క్యూరింగ్ చేయకపోవడంతో దుమ్ము లేస్తోంది. స్థానికుల ఇళ్లలోకి దుమ్ము చేరుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తయ్యే వరకు రోడ్డుపై వాటర్ క్యూరింగ్ చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– బాన్సువాడ రూరల్

సంక్షిప్తం

కంపోస్టు షెడ్డు పరిశీలన



బాన్సువాడ రూరల్ : మొగులాన్‌పల్లిలో మంగళవారం బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ పర్యటించారు. గ్రామంలోని వన నర్సరీ పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్త పడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గ్రామంలోని వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, కంపోస్టుషెడ్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్ తదితరులున్నారు.

నల్లమడుగులో..

లింగంపేట(ఎల్లారెడ్డి): నల్లమడుగు, నల్లమడుగు పెద్ద తండా శివారులో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లను మంగళవారం ఎంపీవో మలహరి పరిశీలించారు. కంపోస్టు షెడ్లల్లో ఎరువులు తయారు చేయడానికి ప్రజలు ముందుకు రావాలన్నారు. అలాగే నర్సరీలు, పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలకు నీళ్లు పట్టాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయితీలో రికార్డులను పరిశీలించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు ఆయాగ్రామాలలో మంగళవారం బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంరావు, సంజీవులు, రాజు, రాంచంద్రం, రంజిత్ రెడ్డి, నర్సిములు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ చెక్కుల పంపిణీ

లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపల్లి(ఖుర్దు) గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పోతరాజు, సాయికిరణ్‌కు చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శేఖర్, భానుచందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ డీఎల్‌పీవోగా సత్యనారాయణరెడ్డి



బాన్సువాడ రూరల్: బాన్సువాడ డీఎల్‌పీవోగా వెంకట సత్యనారాయణరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పంచాయితీ అధికారిగా కొనసాగుతున్న సత్యనారాయణరెడ్డిని ఇన్‌చార్జి డీఎల్‌పీవోగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.